
సాక్షి రంగారెడ్డి

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024



నిధులు లేక ఆగిన అభివృద్ధి

పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోకవడం లేదు. కొన్ని అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. 8లో▸



కుటుంబ పాలన పోయింది..

బీఆర్ఎస్ కుటుంబ పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీడబ్ల్యూసీ సభ్యుడు చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇళ్లు కాలి బూడిదైన ఘటన చేవెళ్లలోని భగత్‌సింగ్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

వెల్‌డన్.. గుడ్ జాబ్



బాలాపూర్ పోలీసులను అభినందిస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

పహాడీషరీఫ్: ప్రయాణికుడు మరిచిపోయిన విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను కనిపెట్టిన బాలాపూర్ పోలీసులను రాచకొండ పోలీస్ కమిషనర్ అభినందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంజాగుట్టకు చెందిన సతీష్ సోదరి వివాహం కోసం మూడున్నర తులాల బంగారం, రూ.50 వేల విలువైన పట్టు చీరలతో కూడిన బ్యాగ్‌ను ర్యాపిడో కారులో పెట్టుకొని బాలాపూర్‌లోని బాలా గార్డెన్‌కు వచ్చాడు. కారులోనే బ్యాగ్‌ను మరిచిపోయాడు. వెంటనే గమనించిన అతడు శివాజీ చౌక్ వద్ద విధి నిర్వహణలో ఉన్న బాలాపూర్ హెచ్‌జీ రవీందర్, హెచ్‌సీ సురేందర్‌కు తెలపడంతో వారు ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డికి సమాచారం చేరవేశారు. బ్లూకోట్స్, పెట్రోలింగ్ సిబ్బంది, సాంకేతిక ఆధారాలతో కారును గుర్తించి బ్యాగ్‌ను ఫిర్యాదుదారుడికి క్షేమంగా అందజేశారు. దీంతో పోలీసులను రాచకొండ సీపీ సుధీర్ బాబు సోమవారం అభినందించి రివార్డ్‌లను అందజేశారు.

సీఎం రేవంత్‌రెడ్డితో బీఆర్ఎస్ నేత కంచర్ల భేటీ



ముఖ్యమంత్రిని కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సినీహీరో అల్లు అర్జున్ మామ, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి కలిశారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి సోమవారం అసెంబ్లీ హాల్‌లో సీఎం రేవంత్‌ను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

గూగుల్‌లో వెతికి మరీ..

ఇంటి నుంచి పరారైన విద్యార్థి



జయేష్ కొనోడియా

బంజారాహిల్స్: ఒక వేళ ఎవరైనా మిస్ అయితే.. పోలీసులు ఎలా కనుక్కుంటారని 12వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి గూగుల్‌లో సెర్చ్ చేశాడు. సెల్‌ఫోన్ సిగ్నల్స్, సీసీపుటేజీల ఆధారంగా పోలీసులు ట్రేస్ చేసి పట్టుకుంటారని గూగుల్ నుంచి సమాధానం దొరికింది. అంతే..సెల్‌ఫోన్‌ను ఇంట్లో పడేశాడు..సీసీ కెమెరాలకు దొరక్కుండా అత్యంత జాగ్రత్తలు తీసుకుని.. చాకచక్యంగా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తనను ఎప్పటికీ కనుక్కోకూడదన్న ఆలోచనతో వెళ్లిపోయిన ఆ విద్యార్థి ఆచూకీ కనుగొనాలంటూ కుటుంబ సభ్యులు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..జూబ్లీహిల్స్ కమలాపురికాలనీ ఫేజ్-2కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శైలేష్ కొనోడియా కుమారుడు జయేష్ కొనోడియా (17) ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 12వ తరగతి చదువుతున్నాడు. గత నెల 17వ తేదీన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అయితే వెళ్లే సమయంలో సెల్‌ఫోన్‌ను ఇంట్లో వదిలేశాడు. కుటుంబ సభ్యులు సెల్‌ఫోన్‌ను చెక్ చేయగా మిస్ అయితే పోలీసులు ఎలా ట్రేస్ చేస్తారనే విషయాలను గూగుల్ ద్వారా తెలుసుకున్నట్లు గుర్తించారు. ఆ మేరకే సెల్‌ఫోన్‌ను ఇంట్లో వదిలేసి, సీసీ కెమెరాలకు చిక్కకుండా వెళ్లిపోయినట్లు తెలుసుకున్నారు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో శైలేష్ సోదరుడు నీలేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీ రంజిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు

అనంతగిరి: అనంతగిరిగుట్ట శ్రీ అనంతపద్మనాభ స్వామి సన్నిధిలో వెలిసిన మార్కండేయ మహర్షి జయంతి ఉత్సవాలను సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు స్వామివారిని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు దర్శించుకున్నారు.

అటు ఇటు.. ఇటు అటు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో స్థానచలనం

- మూడేళ్లుగా ఒకేచోట పని చేస్తున్న వారి మార్పు
- డీపీఓ, డీఆర్‌డీఓ, ఎక్సైజ్ అధికారుల బదిలీ
- జెడ్పీ సీఈఓ, డీఆర్డీఓ అడిషనల్ పీడీలు సైతం..



సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లుగా ఒకే చోట పని చేస్తున్న జిల్లాలోని పలువురు అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఇప్పటికే పలువురు రెవెన్యూ అధికారులను మార్చగా తాజాగా పలు కీలక శాఖలకు చెందిన అధికారులకు స్థానచలనం కల్పించింది. అధికారుల మార్పులో కాంగ్రెస్ సర్కార్ తన మార్క్‌ను చూపింది. జిల్లా పరిషత్ సీఈవో దిలీప్‌కుమార్‌ను మేడ్చల్‌కు బదిలీ చేసి.. ఆయన స్థానంలోప్రస్తుతం యాదాద్రి సీఈవోగా పనిచేస్తున్న సీహెచ్ కృష్ణారెడ్డిని నియమించింది. జిల్లా పంచాయతీ అధికారి కుందూరు శ్రీనివాస్‌రెడ్డికి స్థానచలనం కలిగించి ఆయన స్థానంలో సంగారెడ్డి డీపీఓగా వ్యవహరిస్తున్న వి.సురేష్‌మోహన్‌కు పోస్టింగ్ ఇచ్చింది.

డీఆర్‌డీఓగా శ్రీలత..

డీఆర్‌డీఓ పీడీగా ఎల్.శ్రీలత బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన పి.ప్రభాకర్‌ను ఆయన మాతృశాఖకు బదిలీ చేసింది. రాజేంద్రనగర్ ఆర్‌డీఓగా డిప్యూటీ కలెక్టర్ కె.వెంకట ఉపేందర్‌రెడ్డి (హైదరాబాద్ యూఎల్‌సీ ఎస్‌డీసీ)ని నియమించింది. శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్‌గా కె.వెంకట్‌రెడ్డి (జహీరాబాద్ ఆర్డీఓ)నియమితులయ్యారు. జిల్లా అదనపు డీఆర్‌డీఓగా ఎస్.సుభాషిణి (వికారాబాద్ జెడ్పీ డిప్యూటీ సీఈఓ) నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన అదనపు డీఆర్‌డీఓ బి.నీరజను మేడ్చల్‌కు బదిలీ చేసింది.రాజేంద్రనగర్ ఈటీసీ ప్రిన్సిపాల్‌గా మెదక్ జెడ్పీ సీఈఓ ఎంపీ శైలేష్‌ని, అద్దాల శ్రీకాంత్‌ను ఫ్యాకల్టీగా నియమించింది.

ఎక్సైజ్ అధికారుల బదిలీ

జనగామ జిల్లా ఎక్సైజ్ సూపరింటిండెంట్‌గా పని చేసిన కృష్ణప్రియ శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటిండెంట్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సత్యనారాయణ జగిత్యాలకు బదిలీ అయ్యారు. హైదరాబాద్ -2 సూపరింటిండెంట్‌గా పని చేస్తున్న ఎస్.ఉజ్వలారెడ్డి సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటిండెంట్‌గా నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన రవీందర్‌రావు వనపర్తికి బదిలీపై వెళ్లారు.ఎస్.శ్రీనివాసరెడ్డి (సరూర్‌నగర్),జె.ధన్వంతరెడ్డి(హయత్‌నగర్), ఎ.సీతారాంరెడ్డి (ఇబ్రహీంపట్నం), ఆర్.తిరుపతిరెడ్డి(మహేశ్వరం), టి. శేఖర్ (షాద్‌నగర్) ఎస్‌హెచ్‌ఓలుగా నియమితులయ్యారు.కె.పద్మలత(ఐఎంఎల్ డిపోఆర్‌ఆర్-1),ఎ.బాలరాజు (ఈఎస్‌ఎఫ్‌టీ ఆర్‌ఆర్)నియమితులయ్యారు.

రాచకొండ సీపీగా తరుణ్ జోషి

ఎలక్షన్ కోడ్ ఎఫెక్ట్‌తో సుధీర్‌బాబు బదిలీ

సాక్షి, సిటీబ్యూరో: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన కోడ్ ఎఫెక్ట్‌తో రాచకొండ పోలీసు కమిషనర్‌గా పని చేస్తున్న జి.సుధీర్‌బాబు బదిలీ అయ్యారు. ఈయన్ను మల్టీ జోన్-2 ఐజీగా బదిలీ చేసిన ప్రభుత్వం అక్కడ పని చేస్తున్న తరుణ్ జోషిని రాచకొండ కొత్త సీపీగా నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మూడు కమిషనరేట్ల నుంచి బదిలీ అయిన అధికారుల్లో ఎన్నికల కోడ్ ప్రభావం పడిన వారే అధికంగా ఉన్నారు. కీలక స్థానాల్లో పని చేస్తున్న ఉన్నతాధికారుల బదిలీలకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం గత నెలలో మార్గదర్శకాలు జారీ చేసింది. వీటి ప్రకారం ఈ ఏడాది జూన్ 30ని గడువుగా తీసుకుని.. ఆ తేదీ నుంచి వెనక్కు నాలుగేళ్ల కాలంలో వరుసగా మూడేళ్లు ఓ కమిషనరేట్‌లో విధులు నిర్వర్తిస్తే బదిలీ తప్పనిసరి. సుధీర్‌బాబు 2018 ఏప్రిల్ నుంచి 2023 జనవరి వరకు రాచకొండ కమిషనరేట్‌లో సంయుక్త, అదనపు సీపీగా విధులు నిర్వర్తించారు. డీఐజీ హోదాలో సంయుక్త సీపీగా అక్కడ రిపోర్ట్ చేసి ఐజీగా పదోన్నది పొందిన తర్వాత కూడా కొనసాగుతూ అదనపు సీపీగా పని చేశారు. ఆపై హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం అదనపు సీపీగా బదిలీపై వచ్చారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత గతేడాది డిసెంబర్ 13న రాచకొండ పోలీసు కమిషనర్‌గా వెళ్లారు. ఈసీ మార్గదర్శకాల ప్రకారం 2020 జూలై 1 నుంచి ఒకే కమిషనరేట్‌లో మూడేళ్ల పనిచేసిన జాబితాలో సుధీర్ బాబు ఉన్నారు. దీంతో ఆయన్ను బదిలీ చేసిన ప్రభుత్వం తరుణ్ జోషిని కొత్త సీపీగా నియమించింది. గతంలో రాచకొండ సంయుక్త సీపీగా పని చేసిన అనుభవం ఈయనకు ఉంది. హైదరాబాద్, సైబరాబాద్‌ల్లో కీలక పోస్టింగ్‌లతో పాటు వరంగల్ సీపీగానూ పని చేశారు. కోడ్ ఎఫెక్ట్‌తోనే ఈస్ట్‌జోన్ డీసీపీ బి.సాయి శ్రీ సైతం బదిలీ కాగా..ఆ స్థానంలో మల్కాజ్‌గిరి ఎస్ఓటీ డీసీపీగా పని చేస్తున్న ఆర్.గిరిధర్ నియమితులయ్యారు. గద్వాల డీఐజీగా ఉన్న డి.జోయల్ డెవిస్‌ను సైబరాబాద్ ట్రాఫిక్ సంయుక్త సీపీగా నియమించింది. ఈయన ఇటీవల జరిగిన బదిలీల వరకు వెస్ట్ జోన్ డీసీపీగా, ఆపై సిటీ స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా పని చేశారు. ట్రాన్స్‌కోలో పని చేస్తున్న డి.ఉదయ్‌కుమార్ రెడ్డిని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీగా, ఎస్.రష్మీ పెరుమాళ్‌ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ డీసీపీగా ప్రభుత్వం నియమించింది.



వివరాలు వెల్లడిస్తున్న మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి

తూర్పు గోదావరి టు నారాయణఖేడ్


- అక్రమంగా గంజాయి సరఫరా
- మహేశ్వరంలో పట్టుకున్న పోలీసులు
- రూ.30లక్షల విలువ చేసే 109.88 కిలోలు స్వాధీనం
- ఇద్దరికి రిమాండ్.. పరారీలో మరో ఇద్దరు

మహేశ్వరం: ఆటోలో అక్రమంగా గంజాయి రవాణా చేస్తూ ఇద్దరు పోలీసులకు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.30 లక్షల విలువ చేసే 109.88 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి సోమవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం తుమ్మల చెరువు గ్రామానికి చెందిన సోమ రాజేష్, తాటి చంటి బాబు ఆటో (ఏపీ 28టీవీ 1796)లో తూర్పు గోదావరి జిల్లా నుంచి గంజాయిని తరలిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా ఇంతలూరు వాగు గ్రామానికి చెందిన కొర్ర లోకేష్ నుంచి గంజాయిని తీసుకొని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం ఇరికేపల్లి గ్రామానికి చెందిన భానావత్ రాహుల్ అలియాస్ రాజుకి విక్రయించేందుకు తీసుకువస్తున్నారు. భద్రాచలం, కోదాడ, మిర్యాలగూడ, దేవరకొండ, కల్వకుర్తి, మహేశ్వరం మీదుగా ఔటర్ రింగ్ రోడ్డుపై నుంచి నారాయణఖేడ్ తరలిస్తున్నారు. ఆదివారం స్థానిక పోలీసులు మహేశ్వరం గేటు వద్ద శ్రీశైలం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వర్తిస్తుండగా అనుమానంతో ఆటోను ఆపి తనిఖీ చేశారు. సీట్ల వెనుక, ఇంజన్ కింద ప్యాకెట్లలో దాచిన 109.88 కిలోల గంజాయిని పట్టుకున్నారు. రాజేష్, చంటి బాబును అదుపులోకి తీసుకుని వారి నుంచి 109.88 కిలోల గంజాయి, ఆటో, మొబైల్ ఫోన్, ఆధార్ కార్డులు, లైసెన్స్‌లను స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసుకొని సోమవారం రిమాండ్‌కు తరలించారు. కొర్ర లోకేష్, బానావత్ రాహుల్ పరారీలో ఉన్నారు. గంజాయి పట్టుకున్న పోలీసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు రవీందర్, వెంకట్‌రెడ్డి, సుబ్బారెడ్డి, క్రైం కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

కరెంట్ 'కట్' కట!

- అప్రకటిత కోతలు మరూ
- గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన డిమాండ్
- తాజాగా 65 ఎంయూలకు చేరిన వినియోగం
- తరచూ ట్రిప్పవుతున్న ఫీడర్లు.. సరఫరాలో అంతరాయం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నగరంలో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. సోమవారం గరిష్టంగా 31.4 డిగ్రీలు నమోదైంది. కేవలం పగలే కాదు రాత్రి ఉష్ణోగ్రతల్లోనూ భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. నిన్న మొన్నటి వరకు చలితో వణికిన వారంతా ప్రస్తుతం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు మళ్లీ ఆన్ చేస్తున్నారు. ఫలితంగా విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఇక అనధికారిక కోతలు అమలవుతుండటంతో సిటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవికి ముందే పరిస్థితి ఇలా ఉంటే...ఏప్రిల్, మే మాసాల్లో పరిస్థితి ఎలా ఉంటుందోననే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. గత ఏడాది ఫిబ్రవరిలో ఇదే రోజు 2308 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, తాజాగా సోమవారం 2833 మెగావాట్ల వరకు చేరడం ఆందోళన కలిగిస్తుంది. డిమాండ్‌కు, సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం నమోదవుతుండటం, సబ్‌స్టేషన్లలోని పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నాయి. ఫీడర్లు తరచూ ట్రిప్పవుతున్నాయి. సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి.



65 ఎంయూలకు చేరిన డిమాండ్

గ్రేటర్ పరిధిలో తొమ్మిది సర్కిళ్లు ఉండగా, వీటి పరిధిలో 58 లక్షలకుపైగా విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 52 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మరో ఏడు లక్షల వరకు వాణిజ్య, లక్షకుపైగా ఇతర కనెక్షన్లు ఉన్నాయి. ప్ర స్తుతం విద్యుత్ డిమాండ్ 65 మిలియన్ యూనిట్లకు చేరింది. ఈ నెల మొదటి వారంలో రోజు సగటు డిమాండ్ 55 ఎంయూలు ఉండగా, ప్రస్తుతం 65 ఎంయూలకు చేరింది. కేవలం పది రోజుల వ్యవధిలోనే పది ఎంయూలు పెరగడం విశేషం. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో గృహ, వాణిజ్య విద్యుత్ మీటర్లు అప్పుడే గిర్రున తిరుగుతున్నాయి. ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడంతో రైతులు పంటల సాగుకు పూర్తిగా వ్యవసాయ మోటార్లపైనే ఆధారపడి ఉన్నారు. గృహ వినియోగంతో పాటు వ్యవసాయ వినియోగం కూడా పెరగడంతో లోడ్‌బ్యాలెన్స్‌ను పాటించాల్సి వస్తుంది. పలు ఫీడర్ల పరిధిలో అర్ధరాత్రి తర్వాత సరఫరా నిలిచిపోతుంటే..మరికొన్ని ఫీడర్ల పరి ధిలో తెల్లవారుజాము నుంచి ఉదయం ఏడు గంటల వరకు నిలిచిపోతోంది. ఆ సమయంలో చలిగాలులు వీస్తుండటం, ఆ సమయంలో ఉక్కపోత కూడా లేకపోవడం ఊరట కలిగించే అంశమే అయినప్పటికీ..భవిష్యత్తు డిమాండ్ డిస్కం ఇంజనీర్లకు ఆందోళనకు గురి చేస్తుంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ మాత్రం ఈ అనధికారిక కోతల అంశాన్ని కొట్టిపారేస్తుంది. డిమాండ్‌కు తగినంత సరఫరా ఉందని, సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పుతోంది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది.

'ప్రజావాణి'కి ప్రాధాన్యం ఇవ్వండి

- అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి
- వీలైనంత త్వరగా పరిష్కరించేలా చూడాలి
- అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 149 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలను కలెక్టర్‌శశాంకతో పాటు అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డికి విన్నవించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వినతులు పరిష్కారం కాకుంటే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని.. దీని ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. వాటిలో ఎన్ని పరిష్కరించారు.. ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయన్నది తెలుస్తుందన్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10.30 గంటలకు జిల్లా, మండల, మున్సిపల్ అధికారులందరు రావాలని ఆదేశించారు. రైతులు భూ సర్వేల గురించి దరఖాస్తు చేసేటప్పుడు కలెక్టర్ లేదా అదనపు కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అలా వచ్చారు.. ఇలా చిక్కారు

- లారీలను లిఫ్ట్ అడుగుతూ గంజాయి సరఫరా
- చేవెళ్లలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రూ.16లక్షల విలువ చేసే 64 కిలోల నరుకు స్వాధీనం

చేవెళ్ల: ఎవరికీ అనుమానం రాకుండా లారీలను లిఫ్ట్ అడుగుతూ గంజాయి సరఫరా చేస్తున్న నలుగురు పోలీసులకు చిక్కారు. రూ.16లక్షల విలువ చేసే 64 కిలోల గంజాయితో పట్టుబడ్డారు. చేవెళ్ల సీఐ లక్ష్మారెడ్డి, ఎస్ఐ వీరబ్రహ్మం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రలోని అకోలా ప్రాంతానికి చెందిన చిత్ర కై లాస్ మోహిత్ అనే మహిళ అధిక మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఆశతో తనకు తెలిసిన మదన్ బలసహాబ్ బయాస్, మామ వరుస అయ్యే నవ్‌నాత్‌గణపత్ చౌహాన్, 15 ఏళ్ల తమ్ముడిని కలుపుకొని గంజాయి విక్రయించాలని వక్ర మార్గాన్ని ఎంచుకుంది. ఒడిశాలోని బ్రహ్మపూర్ నుంచి గంజాయిని తెచ్చి మహారాష్ట్రలో విక్రయించటం ద్వారా సొమ్ము చేసుకోవాలని భావించి ఈనెల 7న అంతా కలిసి బ్రహ్మపూర్ వెళ్లారు. అక్కడ లాముపలారి అనే వ్యక్తి వద్ద 64కిలలో గంజాయి కొనుగోలు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు లారీలను లిఫ్ట్ అడుగుతూ హైదరాబాద్ మీదుగా చేవెళ్ల వరకు వచ్చారు. చేవెళ్ల నుంచి శంకర్‌పల్లి మీదుగా సంగారెడ్డి అక్కడి నుంచి మహారాష్ట్రకు వెళ్లేందుకు చేవెళ్లలోని శంకర్‌పల్లి చౌరస్తాలో ఆదివారం రాత్రి లారీల కోసం వేచి చూస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ రేష్మి పెరుమాళ్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆదేశాలతో రాజేంద్రనగ్ ఎస్ఓటీ పోలీసులు, చేవెళ్ల పోలీసులతో కలిసి మూడు సంచుల్లో గంజాయిని తరలిస్తున్న వారిని పట్టుకున్నారు. వారి నుంచి రెండు సెల్‌ఫోన్లు, రూ.16లక్షల విలువ చేసే 64కిలలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పోలీసుల అదుపులో నిందితులు

కార్మిక వ్యతిరేక విధానాలు తగవు

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు రమ

ఆమనగల్లు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ భారత్‌బంద్, కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షురాలు రమ కోరారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసేవారిని కార్మికులుగా గుర్తించి రూ.26 వేల కనీస వేతనం అందించాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం నిర్వహించిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలోని బీజేపీ ప్రభుత్వం మాటలలో జాతీయత, ఆచరణలో విదేశీజపం చేస్తోందని విమర్శించారు. దేశానికి ఆర్థిక వనరులను సమకూర్చే ప్రభుత్వరంగ సంస్థలను పెట్టుబడిదారులకు చౌకగా అప్పగిస్తోందని ఆరోపించారు. కార్మికులు ప్రాణత్యాగాలు చేసి సాధించుకున్న 29 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కట్టుబానిసలుగా మార్చిందని అన్నారు. సమావేశంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షురాలు స్వప్న, రాష్ట్ర నాయకులు ఆంజనేయులు, నాయకులు కానుగుల వెంకటయ్య, శివశంకర్, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, లక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: సమావేశంలో మాట్లాడుతున్న రమ

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

కేశంపేట: ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని.. విజయవంతం చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం పంచాయతీ వర్కర్స్‌తో కలిసి సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లేబర్, విద్యుత్ సవరణ బిల్లులను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని అన్నారు. 2021లో విడుదల చేసిన 5 కనీస వేతనల జీఓలను గెజిట్ చేసి అమలు చేయాలని, స్కీమ్ వర్కర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్లు రాంచంద్రయ్య, పారేష, రోశయ్య, కొప్పు జంగయ్య, రాములు, యాదయ్య, పద్మమ్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభానికి ముందే శిథిలావస్థకు చేరుకుంటున్న జెడ్పీ అతిథి గృహం


నిధులు లేక నిలిచిపోయిన నిర్మాణం

నిధులు లేక ఆగిన అభివృద్ధి పనులు

ప్రారంభానికి నోచుకోని భవనాలు

- సౌకర్యాలు లేని యాచారం ఆర్టీసీ బస్టాండ్
- శిలాఫలకానికే పరిమితమైన ఆస్పత్రి భవనం
- నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి

యాచారం: కోట్లాది రూపాయల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు నిధులు లేక నిలిచిపోవడం, పూర్తయిన భవనాలు ప్రారంభానికి నోచుకోకపోవడం, కొన్ని అభివృద్ధి పనులు శిలాఫలకాలకే పరిమితమయ్యాయి. వ్యాపారపరంగా దినదినాభివృద్ధి చెందుతున్నా, మండలంలో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని మండల ప్రజలు ఎమ్మెల్యే సార్ యాచారం మండలం వైపు దృష్టి పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నిలిచిన అభివృద్ధి పనులు

రూ. కోటి నిధుల ప్రణాళికతో ఎనిమిదేళ్ల కింద మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రూ. 20 లక్షలు ఖర్చు చేసి సమావేశపు హాల్ పనులు ప్రారంభించారు. నిధులు లేవని సాకుతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఉన్న సమావేశపు హాల్ ఇరుకుగా ఉండడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలు, ఇతర ముఖ్యమైన సమావేశాల సమయాల్లో కొందరు అధికారులు, ప్రజాప్రతినిధులు హాల్ బయటనే ఉండాల్సి వస్తుంది. పదేళ్ల క్రితం రూ.25 లక్షల జెడ్పీ నిధులతో మండల కేంద్రంలో అతిథి గృహం నిర్మాణ పనులను ప్రారంభించి, నాలుగేళ్ల క్రితం పనులు పూర్తి చేశారు.


శిలాఫలకానికే పరిమితమైన ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం

కానీ, జెడ్పీ అతిథి గృహం మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఆ భవనం నేడు విషసర్పాలకు, పక్షులకు ఆవాసాలుగా మారింది. ప్రారంభానికి ముందే ఆ భవనం శిథిలావస్థకు చేరుతోంది. అలాగే రూ. కోటిన్నర నిధులతో గతేడాది యాచారం మండల కేంద్రంలో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధులు లేవనే సాకుతో అధికారులు నాలుగు నెలలైన ఆస్పత్రి భవన నిర్మాణ పనులు మొదలు పెట్టడం లేదు. ఏళ్ల కింద నిర్మించిన ఆస్పత్రి భవనంలోనే వైద్యులు రోగులకు సేవలు అందిస్తున్నారు. వర్షాలు కురిస్తే భవనం పూర్తిగా కురుస్తుంది. భవనం పై పెచ్చులుడి పడుతుండడంతో వైద్యులు నిత్యం భయాందోళన మధ్యన డ్యూటీ చేస్తున్నారు.

- మహాలక్ష్మి పథకం పుణ్యామాని యాచారం మండల కేంద్రంలో 20 ఏళ్ల కింద నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్‌కు బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి. కాని బస్టాండ్‌లో తాగునీటి వసతి, మరుగుదొడ్లు, మూత్రశాలలు, ఇతర సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మాల్‌లోని ఆర్టీసీ బస్టాండ్ కూడా నిరుపయోగంగా ఉంది.
- మండల కేంద్రంలోనే కాకుండా నల్లవెల్లి, చింతపట్ల, మంతన్‌గౌరెల్లి, నందివనపర్తి, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, మాల్ తదితర గ్రామాల్లో దాదాపు రూ. 20 కోట్లకు పైగా నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కాక కొన్ని, ప్రారంభానికి నోచుకోక గ్రహణం పట్టినట్లు ఉన్నాయి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా



యాచారం మండలంలో చాలా వరకు పంచాయతీ రాజ్ శాఖ నిధులతోనే పూర్తి చేసే అభివృద్ధి పనులు ఉన్నాయి. జెడ్పీ అతిథి గృహం, ఆస్పత్రి భవనం, సమావేశపు హాల్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ పనులు పూర్తి చేసేలా కృషి చేస్తా. ఎంపీపీ, ఎంపీడీఓలతో కూడా చర్చిస్తా.

– ఉస్మాన్, ఏఈ పంచాయతీ రాజ్ శాఖ

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌పై దాడి అమానుషం

పట్టణ ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్‌కుమార్



షాద్‌నగర్‌రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అరుణపై దాడి చేయడం అమానుషమని జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ ప్రధాన కార్యదర్శి, పట్టణ ఆర్య వైశ్యసంఘం గౌరవ అధ్యక్షుడు రమేష్‌కుమార్, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నారాయణ మల్లేశ్‌బాబు, ప్రధాన కార్యదర్శి బల్లు సతీష్, ఉపాధ్యక్షుడు నరేంద్రుల అమర్ గుప్తా తీవ్రంగా ఖండించారు. సోమవారం పట్టణంలోని ఆర్య సంఘం కార్యాలయంలో రమేష్‌కుమార్ మాట్లాడుతూ.. తూకాలలో మోసాలు జరిగినా, గిట్టుబాటు ధర రాకపోయినా రైతులు మార్కెట్ కమిటీ చైర్మన్‌కు,సెక్రటరీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలే తప్పా ఇలాంటి దుశ్చర్యలకు పా ల్పడటం సమంజసం కాదని హితవు పలికారు. మ హిళ అని చూడకుండా రైతులు ఆమెను కొట్టుకుంటూ తీసుకురావడం సరికాదన్నారు. అచ్చంపే ట మార్కెట్ కమిటీ చైర్మన్‌లుగా ఎందరో పని చేశారని, వారిపై దాడి చేసిన ఘటనలు ఎప్పుడు లేవన్నా రు. దోషులను శిక్షించే వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టేందుకు ఆర్యవైశ్యు లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఇలాంటి ఘటన లు పునరావృతం కాకుండా ప్రభు త్వం తగు చర్య లు తీసుకొని, దాడికి పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా కృష్ణప్రియ



శంషాబాద్: శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా కృష్ణప్రియ నియామకమయ్యారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీలు చేపట్టారు. ఇందులోభాగంగా ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహించిన సత్యనారాయణ జగిత్యాలకు బదిలీ కాగా, ఆయన స్థానంలో జనగామలో పనిచేసిన ఎస్. కృష్ణప్రియ ఇక్కడికి వచ్చారు.

కుటుంబ పాలన పోయింది..


కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్న వంశీచందర్ రెడ్డి

- పేదల ప్రభుత్వం వచ్చింది
- సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచందర్ రెడ్డి
- కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో కొనసాగిన న్యాయయాత్ర

కొందుర్గు: రాష్ట్రాన్ని తొమ్మిదేళ్ల పాటు దోచుకున్న బీఆర్ఎస్ కుటుంబ పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని సీడబ్ల్యూసీ మెంబర్ చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొందుర్గు మండలం ఆగిర్యాలలో ప్రారంభమైన కాంగ్రెస్ న్యాయ పాదయాత్ర వెంకిర్యాల తంగళ్లపల్లి మీదుగా కొందుర్గు మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో వంశీచందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు, బలహీన వర్గాల పార్టీ అన్నారు. పేదల సంక్షేమానికి ఆరు గ్యారంటీలను అందించడానికి ముందుకొచ్చిందన్నారు. ఇప్పటికే రెండు గ్యారంటీలు అమలయ్యాయని, త్వరలోనే మరో నాలుగు గ్యారంటీలు అమలు చేస్తామని స్పష్టం చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుర్చీ వేసుకొని పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తానని నమ్మించి ఇక్కడి ప్రజలతో ఓటు వేయించుకుని గెలిచిన అనంతరం ప్రాజెక్టులో తట్టెడు మట్టి కూడా తీయలేదని విమర్శించారు. పాలమూరు అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని, కేంద్రంలో పార్టీ అధికారంలోకి వస్తే పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే నెల రోజుల్లో 65 వేల పేద కుటుంబాలకు కరెంటు బిల్లు మాఫీ చేస్తామన్నారు.

వంశీచందర్ రెడ్డిని ఎంపీగా గెలిపిద్దాం.. ఎమ్మెల్యే శంకర్

నన్ను గెలిపించిన వారందరూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి వంశీచందర్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పిందని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం గురించి ఏనాడు పార్లమెంట్‌లో మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. పాలమూరు, రంగారెడ్డి అభివృద్ధి చెందాలంటే వంశీచందర్ రెడ్డి ఎంపీగా గెలవాలన్నారు. అనంతరం కొందుర్గు నుంచి చౌదరిగూడ మండలం ఎదిర, రావిర్యాల, గుర్రంపల్లి మీదుగా జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి న్యాయ పాదయాత్ర తరలి వెళ్లింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కావలిరాజు, కొత్తూర్ మాజీ జెడ్పీటీసీ శ్యామ్‌సుందర్ రెడ్డి, నాయకులు పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి. సత్యనారాయణ రెడ్డి, యాదయ్య, మల్లయ్య, లింగం గౌడ్, గోవర్ధన్ గౌడ్, జహంగీర్, వజ్రమ్మ, రామయ్య గౌడ్, రామకృష్ణ గౌడ్, నరేందర్, రవి, ప్రవీణ్, భాస్కర్, సత్యనారాయణ రెడ్డి, చంద్రశేఖర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


అరవింద్ (ఫైల్)

శంకర్‌పల్లి: బైక్‌తో ఆగి ఉన్న కారును ఢీకొట్టిన వ్యక్తి చిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. మోకిల ఎస్సై కోటేశ్వరావు తెలిపిన వివరాల ప్రకారం.. శంకర్‌పల్లి పట్టణ కేంద్రానికి చెందిన అరవింద్ (23), శ్రీకాంత్(26) ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి శంకర్‌పల్లి వైపు బైక్‌పై వస్తున్నారు. మోకిల భారత్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డుపై ఆగి ఉన్న కారును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టడంతో ఇద్దరి తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అరవింద్ సోమవారం ఉదయం మృతి చెందగా శ్రీకాంత్ పరిస్థితి కూడా విషమంగా ఉందని ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మధురలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో శంషాబాద్ ఆర్‌బీనగర్ శిక్షణ కేంద్రం విద్యార్థులు ప్రతిభ చూపారు. కోచ్ భగవాన్ దాస్ ఆధ్వర్యంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులు హర్షిత్ కుమార్‌రెడ్డి, హెత్విశ్రీ, హరిదీప్, విశాల్, సర్వేశ్‌సాయి, మోహిత్, మురళీధర్, అర్జున్ కార్తీకేయ, విష్ణువర్ధన్, గౌస్, రఘువీర్, తరుణ్, సాయితేజ, అవినాశ్‌గౌడ్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, కౌన్సిలర్ పుష్పలత బుచ్చిరెడ్డి, ఆర్‌బీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌గౌడ్ సోమవారం అభినందించారు.

18 వరకు నుమాయిష్

- విద్యారంగ వ్యాప్తికి ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయం
- రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

అబిడ్స్: ఎగ్జిబిషన్ (నుమాయిష్)ను మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్లు ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులు, రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఎగ్జిబిషన్‌లో జరిగిన బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టాల్ హోల్డర్లు, పారిశ్రామిక వేత్తల విజ్ఞప్తి మేరకు ప్రదర్శనను మూడురోజుల పాటు పొడిగిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 15న ముగిసే ఎగ్జిబిషన్ ఫిబ్రవరి 18 వరకు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ వ్యాప్తికి ఎగ్జిబిషన్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వం తరపున ఎగ్జిబిషన్ సొసైటీకి పూర్తి సహకారం అందిస్తామన్నారు. రాష్ట్ర ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.... ఎగ్జిషన్‌ను లక్షలాది మంది సందర్శించడం, వేలాది మంది పారిశ్రామిక వేత్తలు ఉత్పత్తులను అందుబాటులో ఉంచడం ఎంతో గర్వకారణమన్నారు. పారిశ్రామిక రంగానికి ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తుందన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతి సంవత్సరం 30వేల మంది విద్యార్థులకు విద్యను అందించడం అభినందనీయమన్నారు. నగరంలోనే కాక జిల్లాల వారీగా ఎగ్జిబిషన్‌ను నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సందర్భంగా పలు ప్రభుత్వ శాఖలు స్టాల్ హోల్డర్లకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షులు వనం సత్యేందర్, కార్యదర్శి హన్మంతరావు, కోశాధికారి రాజేందర్ కుమార్, సంయుక్త కార్యదర్శి చంద్రజిత్ సింగ్, కమిటీ సలహాదారులు వనం వీరేందర్, కన్వీనర్ డి.సురేష్‌కుమార్, సొసైటీ ప్రతినిధులు డాక్టర్ గంగాధర్, ప్రభాశంకర్, చంద్రశేఖర్, ప్రేమ్‌కుమార్, ఆర్.సుఖేష్‌రెడ్డి, ఎస్.వినయ్‌కుమార్ ముదిరాజ్, మంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి కిడ్నాప్

చితకబాది వదిలేసిన కిడ్నాపర్లు

పోచారం: గుర్తుతెలియని వ్యక్తులు ఓ యువకుడిని కిడ్నాప్ చేసి చితకబాది వదిలేసిన సంఘటన పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ బీ.రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్‌కు చెందిన ఉదయ్‌కుమార్ ఈ నెల 8న సంస్కృతి టౌన్‌షిప్‌లో ఉంటున్న తన స్నేహితుల వద్దకు వచ్చాడు. ఆదివారం రాత్రి బైక్‌లపై వచ్చిన నలుగురు వ్యక్తులు ఉదయ్‌రాజ్‌ను బలవంతంగా తీసుకెళ్లారు. దీంతో ఆందోళనకు గురైన అతడి స్నేహితులు ఉదయ్ కోసం గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ తెలియకపోవడంతో 100 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిజామాబాద్‌కు చెందిన తనుష్ కిడ్నాపర్లలో ఉన్నట్లు గుర్తించారు. తనుష్ ఫోన్ నంబర్‌ను ట్రాక్ చేయగా మల్కాజ్‌గిరి, బొల్లారం, శామీర్‌పేట్ ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు నిజామాబాద్‌లోని తనుష్ ఇంటికి వెళ్లి ఆరా తీశారు. దీనిపై సమాచారం అందడంతో కిడ్నాపర్లు ఉదయ్‌రాజ్‌ను చితకబాది తార్నాకలో వదిలేసి పరారయ్యారు. తనుష్ సోదరితో ఉదయ్ ప్రేమ వ్యవహారమే కిడ్నాప్‌నకు కారణంగా తెలుస్తోంది.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


కాలిపోయిన వస్తువులు

కాలిపోయిన ఇంట్లోని వస్తువులు

చేవెళ్ల: షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇళ్లు కాలి బుడిదయిన ఘటన మండల కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రంలోని సన్నాయి శ్రీనివాస్, రాధికల ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి నిత్యావసరాలు, 20వేల నగదు, సర్టిఫికెట్లు కాలిబుడిదయ్యాయి. స్థానికులు, ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లోని వస్తువులు మొత్తం కాలిపోయాయి. దీంతో బాధితులు బోరున విలపించారు. సుమారు రూ.5 లక్షల ఆస్తినష్టం జరిగినట్లు వాపోయారు. స్పందించిన ఆర్ఐ రాజేశ్, విద్యుత్ ఏఈ జానీమోహిన్‌దీన్‌లు పరిశీలించి పంచనామా చేశారు. ఉన్నతాధికారులకు నివేదికను అందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జూకన్నగారి శ్రీకాంత్‌రెడ్డి రూ.20వేలు, పూజారులు శ్రీకాంత్, శ్రీపాదులు రూ.10వేలు, మాజీ వార్డు సభ్యుడు శ్రీనివాస్ రూ. 5వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.


ఆర్థిక సహాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి

ఘనంగా పెద్దమ్మతల్లి కల్యాణోత్సవం


సదరు పటంలోకి ప్రవేశిస్తున్న శివసత్తులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గరిగుట్ట అమ్మవారి కల్యాణ మహోత్సవం సోమవారం నేత్ర పర్వంగా కొనసాగింది. ఉత్సవాలలో చివరి రోజు కావడంతో ఒగ్గు కళాకారులు ఆలయం ఆవరణలో చక్కటి ముగ్గులతో సదరు పటాన్ని వేశారు. అనంతరం ఆలయ ధర్మకర్త కరన్‌కోట్ విఠల్‌బాబా పర్యవేక్షణలో అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. శివసత్తులకు ఆచారాల సమర్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా కొనసాగింది. ఈ సందర్భంగా జరిగిన అమ్మవారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద హాజరయ్యారు. అనంతరం విఠల్‌బాబా అమ్మవారి ఆలయంలో 50 మంది శివసత్తులతో కలిసి అగ్నిగుండాల ప్రవేశం చేశారు. జల్‌పల్లి కౌన్సిలర్ యాదగిరి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల కథలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జల్‌పల్లి మున్సిపాలిటీ డీఈ వెంకన్న, పోలీసు అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు యంజాల అర్జున్, ఎనగండ్ల శ్రీధర్‌గౌడ్, శ్రీనురెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.


అమ్మవారి కల్యాణం జరిపిస్తున్న విఠల్‌బాబా